ప్రజాశక్తి

సోమవారం 14 ఆగస్టు 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



మాట్లాడుతున్న తీస్తా సెతల్వాడ్

ప్రజల మధ్య విద్వేషాలు తీసుకురావద్దు

- ఐలు రాష్ట్ర మహాసభలో వక్తల పిలుపు
- మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని బిజెపిపై తీస్తా సెతల్వాడ్ విమర్శ

8లో



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పాశం రామారావు, ఇతర నాయకులు

రాజకీయ పరిణామాలపై 25న సభ

హాజరు కానున్న సిపిఎం పొలిట్‌బ్యూర్ సభ్యులు బి.వి.రాఘవులు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు- ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 25న మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. ఈ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు హాజరు అవుతారన్నారు. ఈ మేరకు ఆదివారం బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటాయని, మరోవైపు ప్రజలకు సరైన ఉపాధి లేక పేదల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలుగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెబుతుందని విమర్శించారు. భిన్నంత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో ఏకరూప పౌరస్మృతిని తెస్తూ ప్రజల మధ్య విభజనను సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. మణిపూర్‌లో 3 నెలల నుండి తెగల మధ్య

2లో

రైతులను మోసం చేసిన జగన్



వేదికపై నారా లోకేశ్, ఉండవల్లి శ్రీదేవి, తెనాలి శ్రావణ్‌కుమార్, రాజధాని రైతు నాయకుల అభివాదం

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ విమర్శలు

రాజధాని అమరావతి రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి-తుళ్లూరు

రైతులను సిఎం జగన్ మోసం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర ఆదివారం గుంటూరు జిల్లా మేడికొండూరు, తాడికొండ మండలాల్లో జరిగింది. రావెల శివార్లలో 'అమరావతి ఆవేదన' పేరుతో రాజధాని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. లోకేష్ మాట్లాడుతూ ఆనాడు అమరావతికి జై అన్న జగన్... నేడు కులం పేరుతో నిర్వీర్యం చేశారన్నారు. మూడు రాజధానులని చెబుతూనే ఎక్కడా ఒక్క భవనం నిర్మించలేదన్నారు. మూడు రాజధానులన్న వ్యక్తి 3 ఇటుకలైనా వేశాడా? అని ప్రశ్నించారు. హైకోర్టు మార్పుపై కనీసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపలేదని, ఇప్పుడు వైజాగ్ ప్రజలను కూడా వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందని అన్నారు. వైసిపి అధికారిక ట్విట్టర్‌లో రిషికొండపై సచివాలయం కడుతున్నారని చెప్పిన 2 గంటల్లోనే పోస్టు తొలగించారన్నారు. కర్నూలు ప్రజల్ని, అమరావతి రైతులను జగన్ మోసం చేశాడన్నారు. విశాఖ ప్రజలు కూడా జగన్ మోసాన్ని గ్రహించాలన్నారు. మహిళల కన్నీటితోనే జగన్ ప్రభుత్వం భూస్థాపితం అవుతుందన్నారు. జగన్ మాటలకు ఆనాడు అందరూ

2లో

కౌల్దార్లకు బ్యాంకర్ల మొండిచేయి

పంట రుణాలపై దాటవేత వైఖరి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కౌలు రైతులకు ఆశించిన స్థాయిలో సహకారం అందడంలేదు. కౌలురైతులకు వ్యవసాయశాఖ అధికారులు సాగు ధ్రువపత్రాలు (సిసిఆర్‌సి) కొంత మేరకు ఇచ్చినా రుణాలు అందడంలేదు. ఒకవైపు అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో అల్లాడుతున్న రైతులు ఈ ఏడాది పెట్టుబడి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రెండు జిల్లాల్లో కలిపి 1.03 లక్షల మందికి సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గుంటూరు జిల్లాలో 54 వేలమందికి సిసిఆర్‌సి ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గతనెలలో సురక్ష పథకం ద్వారా సిసిఆర్‌సిలు ఇస్తామని అధికారులు ప్రకటించినా ఆశించిన స్థాయిలో సిసిఆర్‌సిలు జారీ కాలేదు.కేవలం జిల్లాలో ఆరువేల మందికే ఇచ్చారు. గతరెండు నెలలకాలంలో మొత్తంగా 33 వేల మందికి సిసిఆర్‌సి కార్డులు ఇచ్చినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 49 వేల మందికి సిసిఆర్‌సిలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా 28 వేలమందికి ఇచ్చారు.

రెండు జిల్లాల్లో కలిపి కౌలురైతులకు ఇప్పటి వరకు కేవలం రూ.60 కోట్ల రుణాలు ఇచ్చారు. అయితే బ్యాంకర్లు మాత్రం సిసిఆర్‌సి కార్డులున్నా పంటరుణాలు ఇవ్వడం లేదు. కొంత

2లో

17న చలో విద్యుత్ సౌధకు తరలిరండి

విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపు

8లో



5లో

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని నిరసన

స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ రిహార్సల్స్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డు మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో జరగనున్న 77వ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరేడ్‌కు ఆదివారం రిహార్సిల్స్ చేశారు. పరివీలించిన జిల్లా ఎస్పీ


2లో



రాజకీయ పరిణామాలపై 25న సభ

(మొదటి పేజీ తరువాయి)

విభేదాలు సృష్టించారని, మైనార్టీపై సంఘపరివార్ శక్తులు మూకదాడులు చేస్తూ, చర్చీలపై దాడులు, గృహదహనాలు, సామూహిక హత్యలు, మహిళలను వివస్త్రను చేసి ఊరేగించడం వంటి దారుణాలకు పాల్పడుతున్నా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని మండిపడ్డారు. వేలాది కేసులు పోలీస్‌స్టేషన్‌లో బాధితులు పెట్టినా నిందితులను అరెస్టు చేయకపోవడం, రాష్ట్ర ముఖ్యమంత్రి దాడులు చేస్తున్న వారికి మద్దతు పలకడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, ప్రత్యేక హోదా, రాజధాని నిధులు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ రైల్వే జోన్‌కు నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని అన్నారు. అయినా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలకడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, కస్టమర్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగ ఐక్యంగా ఉద్యమించాలని, ఈ నేపథ్యంలో జరిగే సభలో ప్రజలు ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, ఇ.అప్పారావు, నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ రిహార్సల్స్

(మొదటి పేజీ తరువాయి)

వై.రవిశంకర్‌రెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం చేసిన తరువాత అదనపు ఎస్పీ (ఎఆర్) డి.రామచంద్రరాజు పర్యవేక్షణలో ఎఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ సూచనల మేరకు నరసరావుపేట డీఎస్పీ మహేష్ పరేడ్ కమాండర్‌గా ఎస్పీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కవాతు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్సీ (అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కౌల్దార్లకు బ్యాంకర్ల మొండిచేయి

(మొదటి పేజీ తరువాయి)

మంది రైతులకు కలిపి గ్రూపు రుణాలిస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వర్తింపచేయడం లేదు. ఒక్కో రైతుకు సగటున రూ.20 వేలనుంచి రూ.30వేలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో కౌలురైతులు పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. సిసిఆర్‌సి కార్డులు ఆలస్యంగా ఇవ్వడం వల్ల వీరికి రైతుభరోసా కూడా ఇవ్వడం లేదు. కౌలు రైతుల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందినవారికే గతేడాది రైతు భరోసా ఇచ్చారు. ఈ తరగతులకుచెందిన 10 వేల మందికే గతేడాది రైతు భరోసా దక్కింది. భూ యజమానులకు కూడా కొన్ని బ్యాంకులు ఇవ్వడం లేదు. కౌలు రైతులకు సవాలక్ష ఆంక్షలు పెడుతున్న బ్యాంకులు యజమానులను కూడా ముప్పతిప్పలు పెడుతున్నారు. ప్రధానంగా స్టేట్ బ్యాంకు అధికారులు అటుకౌల్దార్లకు, ఇటు యజమానులకు రుణాలు ఇవ్వడం లేదన్న విమర్శలు ప్రభలంగా ఉన్నాయి. కొంత పొలం సొంతంగా ఉండి, కొంత పొలం కౌలుకు తీసుకున్నా రుణాలు దక్కడం లేదు.

పల్నాడు, గుంటూరు జిల్లాలో గత మూడ్రోజులుగా అడపాదడపాగా కురిసిన వర్షాలతో కొన్ని మండలాల్లో పైర్లు వేయడానికి రైతులు సన్నద్ధమయ్యారు. ప్రధానంగా డెల్టాలో కాల్వలకు నీరు వస్తుండటంతో వరి సాగుకురైతులు సన్నద్ధమయ్యారు. జిల్లాలో 3.28 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అంచనా వేయగా ఇప్పటివరకు కేవలం 1.40 ఎకరాల్లో సాగైంది. 1.65 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 80 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. 76 వేల ఎకరాల్లో పత్తిసాగు చేయాల్సి ఉండగా 50 వేల ఎకరాల్లోనే వేశారు. 56 వేల ఎకరాల్లో మిర్చిసాగు చేయాల్సి ఉండగా కేవలం 600 ఎకరాలు, పసుపు ఐదు వేల ఎకరాలకు గాను 2400 ఎకరాల్లో సాగు చేశారు. మరో 7 వేల ఎకరాల్లో ఇతర పంటలు వేశారు. పల్నాడు జిల్లాలో 5.12 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలుసాగు అవుతా యని అంచనా వేయగా ఇప్పటి వరకు 1.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. లక్షా 10 వేల ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా నీటివిడుదలపై స్పష్టత లేకపోవడం వల్ల అయోమయం ఏర్పడింది. పత్తిసాగు ఊపందుకుంది. పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 1.30 లక్షల ఎకరాల్లోపత్తి పంటవేశారు. 1.20 లక్షల ఎకరాల్లో మిర్చిసాగవుతుందని అంచనా వేయగా ఇప్పటివరకు 2 వేల ఎకరాల్లోనే సాగైంది. పెట్టుబడి సొమ్ము అందుబాటులో ఉన్న వారు సేద్యంకు ముందుకు వెళ్తుండగా మిగతా వారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

రైతులను మోసం చేసిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

మోసపోయారని, అధికారంలోకి వచ్చాక మరో మాట మాట తప్పి, మడమతిప్పారని విమర్శించారు. రాజధాని మహిళలను జుట్టుపట్టుకుని ఈడ్చారు... బూటుకాళ్లతో తన్నారు... వెయ్యిమందిపై తప్పుడు కేసులు బనాయించారు... అమరావతి రైతుల త్యాగాలు వృథాగా పోవు అని అన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా ఎన్నికల్లో గెలవడం కోసం 2019లో రాజధాని ఎక్కడికి పోదు.. వైసిపి అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తామన్నారని, అది ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు.

అమరావతి నుండే వైసిపి పతనం : ఎమ్మెల్యే శ్రీదేవి

ఇదిలా ఉండగా లోకేష్ యువగళంలో వైసిపి ఎమ్మెల్యే వుండవల్లి శ్రీదేవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తాడికొండ నియోజకవర్గంలోని రావెలలో రాజధాని రైతులతో ముఖాముఖి నిర్వహించగా కార్యక్రమం ప్రారంభం అవుతున్న సమయంలో శ్రీదేవి అనూహ్యంగా వేదిక పైకి వచ్చారు .సభ ముగిసే వరకూ లోకేష్‌తో పాటు శ్రీదేవి ఒక్కరే ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను మీ వైపే..నా ప్రాణం పోయినా అమరావతి వైపే ఉంటా అని అన్నారు. అమరావతి నుంచే వైసిపి పతనం మొదలవుతుందని, రాజధాని ప్రాంతం మందడంలో ఇసుక డాన్‌ను దించారని, మూడు రాజధానుల శిబిరాన్ని ఏర్పాటు చేయించారని అధికార పార్టీ ఎంపిపై పరోక్ష విమర్శలు చేశారు.

అమరావతి మహిళల ఆవేదన

పద్మ అనే మహిళ మాట్లాడుతూ 'రాజధాని లేదని భూములిచ్చాం.. మా భూముల్లో రాజధాని నిర్మాణం మొదలు పెట్టారు.. ఈ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానులను వ్యతిరేకించాం.. ఉద్యమం చేసే సమయంలో దుర్గ గుడికి మొక్కలు చెల్లించుకోవడానికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. ఎవడివ్వమన్నారే భూములు అని పోలీసులు మాట్లాడారు. కడుపు నిండా అన్నం తిని, కంటి నిండ నిద్రపోయి నాలుగేళ్లు అయింది. దుర్భాషలాడి రోడ్డుపై ఈడ్చారు. పెయిడ్ ఆర్టిస్టులని మమ్మల్ని అవమానించారు.. మా బాధలు చెప్పుకోవడానికి బయటకు వస్తే కొట్టారు..' అని ఆవేదన వ్యక్తం చేశారు. తాటినేని రాజేశ్వరి మాట్లాడుతూ 'మేము నాలుగెకరాలిచ్చాం. అరసవెల్లి పాదయాత్రకు వెళ్తుంటే మమ్మల్ని కొట్టేందుకు రాజమండ్రిలో రాళ్లు, పెట్రోల్ బాటిళ్లు విసిరారు. అయినా తగ్గకుండా వెళ్తుంటే కొట్టారు..' అని వివరించారు. భూక్యా నాయక్ మాట్లాడుతూ 'నేను రాజధానికి అరెకరం పొలం ఇచ్చాను. పోలీసులు తెల్లవారుజామున తీసుకువెళ్లి వేధించారు. నోరు లేని మా అబ్బాయిని బూతు కాళ్లతో తొక్కారు. తెనాలి తీసుకెళ్లి మంగళగిరి తీసుకొచ్చారు. మేము ఏం పాపం చేశాం.. పనిచేసుకుని బతికే వాళ్లం.. ఎన్నో విధాలుగా హింసలు పెట్టారు. ఇంట్లో మహిళ బాధతో ఉందన్నా వినకుండా పోలీసులు తీసుకెళ్లారు..' అని చెప్పారు. అంకం స్వర్ణ కమల మాట్లాడుతూ '70 సెంట్ల అసైన్డ్ భూమిని రాజధానికి ఇచ్చాను. అసైన్డ్ రైతులకు కౌలు కూడా ఇవ్వడం లేదు..' అని అవేదనకు గురయ్యారు. వెలగపూడికి చెందిన రైతు కంచర్ల గాంధీ మాట్లాడుతూ



'ప్రజాప్రతినిధులు, అధికారులు మమ్మల్ని భూములివ్వాలని ఒత్తిడి చేశారు. ఇప్పుడు మేము ఇన్ని కష్టాలు పడుతుంటే వాళ్లంతా ఎక్కడున్నారు?' అని నిలదీశారు. రాయపూడికి చెందిన సాహెబ్ జాన్ అనే రైతు మాట్లాడుతూ భూములు తీసుకొని కౌలు ఎందుకు ఇవ్వరని నిలదీశారు. తుళ్లూరు మాజీ సర్పంచ్ నరసింహారావు మాట్లాడుతూ ఎక్కడో ఉన్న వారిని రాజధానిలో కాకుండా వారి సొంత ఊరిలో 3 సెంట్లు స్థలం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు, మాకినేని పెదరత్తయ్య, టిడిపి తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెనాలిశ్రావణ్ కుమార్, అమరావతి ఉద్యమ నాయకులు పువ్వాడ సుధాకర్, గద్దె తిరుపతిరావు, ఆళ్ల శివారెడ్డి, కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటిపాదయాత్ర వివరాలు

ఉదయం 8 గంటలకు రావెల శివారు క్యాంప్ సైట్ నుంచి పాదయాత్ర ప్రారంభం

10 గంటలకు పొన్నెకల్లులో ముస్లిములతో సమావేశం

11 గంటలకు తాడికొండ అడ్డరోడ్డులో స్థానికులతో సమావేశం

11.45 గంటలకు తాడికొండ శివార్లలో ఆడిటర్లతో ముఖాముఖి

మధ్యాహ్నం 12.45 గంటలకు తాడికొండ శివార్లలో భోజన విరామం

సాయంత్రం 4 గంటలకు తాడికొండ శివార్ల నుంచి పాదయాత్ర కొనసాగింపు

5 గంటకు తాడికొండ ఎన్‌టిఆర్ సర్కిల్లో స్థానికులతో మాటామంతి

రాత్రి 8 గంటలకు కంతేరులో స్థానికులతో సమావేశం

9.30 గంటలకు నిడమర్రు శివారు విడిది కేంద్రంలో బస

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నీరు గార్చడమే

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్, ఎన్నికల కమిషనర్‌ల నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ఒక కేంద్ర మంత్రిని తీసుకునేందుకు ప్రతిపాదిస్తూ కేంద్రం మరో వివాదాస్పద బిల్లును తెరపైకి తీసుకురావడాన్ని అవగాహన సంస్థ ఖండించింది. ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. ఈ నియామకాలపై ఇది వరకు సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నీరుకార్చేలా ప్రభుత్వ చర్య ఉందని, దీనిని సంస్థ నిరసిస్తోందని పేర్కొంది.. ఎన్నికల సంఘం నియామకాల్లో ప్రభుత్వ నియంత్రణను పెంచి ఈసిని తోలుబొమ్మలా చేసేందుకే ఈ బిల్లుని తీసుకువస్తున్నారని, దీనిని అందరూ వ్యతిరేకించాలని సంస్థ విజ్ఞప్తి చేసింది. ఇప్పటివరకూ సిఇసి, ఇసిల నియామకాల కమిటీలో ప్రధానమంత్రి, ప్రతిపక్షనేత, భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉన్నారని, అయితే, ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర మంత్రి ఉంటారని తాజాబిల్లులో ప్రతిపాదించారని విమర్శించింది.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

27న పల్నాడు జిల్లాకు సిపిఐ బస్సు యాత్ర

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుండి సెప్టెంబర్ 8 వరకు జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సిపిఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా నాగేశ్వరరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే యాత్ర ఈ నెల 27న నాదెండ్ల మండలం సాతులూరుకు చేరుకుంటుందని చెప్పారు. యాత్రకు ఘనంగా స్వాగతం పలికేందుకు అన్ని ప్రాంతాల్లోని శ్రేణులు తరలిరావాలన్నారు. నరసరావుపేటలో రోడ్డు షో, వినకొండలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.కె హుస్సేన్, కె.రాంబాబు, బి.శ్రీనివాసరావు, కె.శరత్, బి.రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, సిహెచ్ సత్యనారాయణరాజు, ఎన్.రామసుబ్బాయమ్మ, సుభాని, సుబ్బారావు, వెంకట్, చిన్నసైదా, బాబురావు, వాగ్యా నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- నాదెండ్ల, ప్రతిపాడు మండలాల్లో ఘటనలు
- మహిళ, యువకుడు మృతి
- రహదారిపై మృతురాలి బంధువుల ఆందోళన
- నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి - నాదెండ్ల

రోడ్డు ప్రమాదంలో గొరిజవోలు గ్రామానికి మహిళ దుర్మరణం చెందగా, భర్త, కుమార్తెకు గాయాలయ్యాయి. ఈ సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి లోని మండలంలోని సాతులూరు పొనుగు పాడు కాలవ కట్ట సమీపంలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం గొరిజవోలుకి చెందిన గారపాటి రాంబాబు భార్య జయ రాణి (30), వారి కుమార్తె నరసరావుపేట నుండి ద్విచక్ర వాహనం పై వస్తూ రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి సడన్ బ్రేక్ వేశారు. అయితే, ఎదురుగా వస్తున్న బస్సు తమ వాహనానికి తగిలించి వెళ్ళిపోయిందని భర్త చెప్పారు. ఈ సంఘటన జరిగిన వెంటనే 108కు ఫోన్ చేశారు. వాహనం వచ్చే సరికే మహిళా మృతి చెందింది. పొనుగు పాడు, గొరిజవోలు గ్రామాల్లోని వారికి సంబంధించిన బంధువులు అక్కడికి వెళ్లారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలంటూ ఆదివారం ఒంటిగంట నుండి రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. నరసరావుపేట, చిలకలూరిపేట పోలీసులు వచ్చినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సాయంత్రం ఏడు గంటల వరకు వారు రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో, గుంటూరు ,నరసరావుపేట వైపుల నుండి వస్తున్న వందల సంఖ్యలో వాహనాలు సుమారు పది కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయాయి. దీంతో, ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. కొంతమంది ప్రయాణికులు ఇంకా ఆలస్యం అవుతుందేమోనని భావించి వాహనాలు నుండి దిగిపోయి, పక్కనున్న పొలాల వైపుగా నడుచు కుంటూ సాతులూరు గ్రామం చేరుకున్నారు

బైక్‌ను ఢీ కొట్టిన కారు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

కారు,బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసు కుంది. ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపిన వివరల ప్రకారం ప్రత్తిపాడుకి చెందిన బొబ్బూరి రామకృష్ణ (29) తన మోటార్‌సైకిల్‌పై గ్రామంలోని మెయిన్ రోడ్ లోని పెట్రోల్ బంకు నుండి మారుతీ సినిమా హాల్ వైపు వెళుతుండగా అదే సమయంలో పర్చూరు వైపు నుండి గుంటూరు వైపు అతివేగంగా వస్తున్న కారు, మోటార్ సైకిల్ ను ఢీ కొట్టడంతో దానిపై ఉన్న రామకృష్ణ కిందపడిపోయాడు. అతని తలకు, ఇతర శరీరభాగాలకు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో జిజిహెచ్‌కు తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే అతను చనిపోయినట్లుగా ధ్రువీకరించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పొనుగుపాడు కాలవ కట్ట సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మహిళ జయరాణి



రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్



మృతుడు రామకృష్ణ



నడిచి వెళుతున్న ప్రయాణికులు



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

ప్రజాగొంతుక గద్దర్

ప్రజాశక్తి-గుంటూరు

తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, అణగారిన ప్రజలకు భూమి కోసం, భుక్తి కోసం తన మేధా సంపత్తితో తన పాటనే ఆయుధంగా చేసుకొని లక్షలాది మందిని చైతన్యవంతుల్ని చేసిన గొప్ప విప్లవయోధుడు గద్దర్ అని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం బీమ్ భారత్ సంఘం ఆధ్వ ర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో బీమ్ భారత్ రాష్ట్ర అధ్య క్షులు పాగళ్ల ప్రకాష్, ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు, నాయి బ్రాహ్మణ జెఎసి రాష్ట్ర అద్యక్షులు తాటికొండ నరసింహారావు, దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కె.బాబురావు, బీమ్ సేన్ సేవాదళ్ అధ్యక్షులు నల్లపు నీలాంబరం, బిసి మహాజనవేదిక ఉగ్గం సాంబశివరావు, రైతుకూలీ సంఘం అధ్యక్షులు నాదెండ్ల బ్రహ్మయ్య, ఎ.సుజాతరావు, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



ప్రజల గొంతుకై నినదించి అమరుడైన గద్దర్, పీడిత ప్రజల కోసం రచనలు చేసి అ వ ౦ ౦ ౦ డై న సియాసత్ పత్రిక ఎడిటర్ జహీర్ అలీ ఖాన్ సంతాప సభను ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హెూం లో నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి పిడీఎం నాయకులు చికనం చిన్నా అధ్యక్షత వహించారు. పిడిఎఫ్ సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాట్లా డారు. కార్యక్రమంలో పిడిఎం సీనియర్ నాయకులు ఎన్.రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, రామ కృష్ణ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కోశాధికారి యు.నాగేశ్వర రావు, జిల్లా కార్యదర్శి రాణి తదితరులు పాల్గొన్నారు.



సిరిపురం నుంచి లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి-మేడికొండూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నాయ కులు నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఆది వారం సిరిపురం గ్రామం నుంచి ప్రారంభమైంది. లోకేష్ కు సిరిపురం గ్రామ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా మహిళలు, వృద్ధులు చిన్నా రులు పెద్ద సంఖ్యలో వచ్చారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షులు రావిపాటిసాయి ఆధ్వర్యంలో మిరప కాయలు,టమాటాలతో ఏర్పాటు చేసిన గజమాలతో ఆయనను సత్కరించారు. మిర్చి, టామాటలు ధరలు పెరిగి ప్రజలు పడుతున్న ఇబ్బందులను రావిపాటి లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామ పురవీధులలో అందర్నీ ఆప్యాయంగా పలకరించుకుంటూ పాదయాత్ర కొనసాగించారు. లోకేష్ వెంట తెలుగుదేశం పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్చార్జ్ తెనాలి శ్రావణ్ కుమార్ ముందుండి గ్రామంలో తలెత్తుతున్న సమస్యలపై వివరిస్తూ పాదయాత్రను కొనసాగిం చారు. వరగాని మీదుగా రావెలకు చేరుకుంది.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామమైన డోకిపర్రు గ్రామంలో ఆదివారము నూతన సచివాలయం భవనం వద్ద ఉచిత వైద్య శిబిరం జరిగింది. గుంటూరు రూరల్ మండలం పెద్దపలకలూరు గ్రామములోని ప్రవీణ్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం జరిగింది. గ్రామ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, వైద్య పరీక్షలు చేయించుకుని, ఉచితముగా మందులు తీసుకున్నారు.



ఉచిత వైద్య శిబిరంలో చేయించుకున్న వారికి ఉచితంగా మం దులను డోకిపర్రు ఎంపీటీసీ నోసిన రామకోటమ్మ, ప్రవీణ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రవీణ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల రైతు భరోసా చైర్మన్, మాజీ సర్పంచ్ ఉడత శ్రీనివాసరావు, రైతు భరోసా గ్రామ కన్వీనర్ నోసిన కోటి,డాక్టర్ ప్రవీణ్ . డాక్టర్ లక్ష్మీనారాయణ . డాక్టర్ చంద్రలత పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్ వల్లే సాధ్యం

- ఎవరు ఎన్ని యాత్రలు చేసినా సంక్షేమం ఆగదు
- నియోజకవర్గ సమన్వయకర కత్తెర సురేష్ కుమార్



ప్రజాశక్తి - తాడికొండ

జగన్మోహన్ రెడ్డి సంక్షేమం అభివృద్ధికి కృషి చేస్తుంటే చంద్రబాబు నాయుడు,లోకేష్ లు సంక్షేమాన్ని అభివృద్ధిని ఆటంకపరచాలని ప్రయత్నిస్తున్నారని నియోజకవర్గ సమన్వయ కర్త కత్తెర సురేష్ కుమార్ విమర్శించారు. ఆది వారం విలేకరులతో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధికి ఎవరు అడ్డు వచ్చినా ఆగదని అన్నారు. అభివృద్ధి నిరోధకులుగా తండ్రీకొడుకులు వ్యవ హరిస్తున్నారని, తాము గెలవమని తెలిసినప్పటికీ అనవసరంగా ఆగళ, ఈగళం ఇవ్వగలమని యాత్రలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకేమో వయసు అయిపోయింది లోకేష్‌కేమో మాట్లాడటం రాదని అన్నారు. దేశంలోనే సంక్షేమం,అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉన్న ఎపిని భ్రష్టుపట్టించేలా (తండ్రీకొడుకులు విమర్శలు చేస్తూ, డ్రామా లాడుతున్నారని అన్నారు. జనం కూడా రాక పోవడంతో డబ్బులు ఇచ్చి మీటింగులకు తెచ్చుకుంటున్నారని, రాజధానిలో రైతులను మోసం చేసింది చంద్రబాబు అని అన్నారు తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం భూము లను లాక్కుని రైతులను మోసం చేశారని ఆరోపించారు. రైతుల గురించి మొసలి కన్నీరు కారుస్తూ,పెయిడ్ ఆర్టిస్టుల ద్వారా ఉద్యమం పేరుతో ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు ఇకనైనా న జిమ్మిక్కులు మానుకోవాలని అన్నారు. లోకేష్ , అవినీతి ఎమ్మెల్యేతో కుమ్మక్కయ్యారని, ఇప్పుడు వీళ్ళందరూ ఒకటేనన్న విషయం బయటపడిందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే శ్రీదేవి వెనుక నుండి నడిపించింది తెలుగుదేశం పార్టీ అని ఇప్పుడు స్పష్టమైందని అన్నారు.



కేక్ కట్ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

ఘనంగా కన్నా పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ 69వ పుట్టినరోజు వేడుకలను స్థానిక కాకతీయ కళ్యాణమండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పివిఎస్ కళ్యాణ మండపం నుండి కాకతీయ కళ్యాణ మంటపం వరకు కన్నా లక్ష్మీనారాయణను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన 69 కిలోల భారీ కేక్‌ను కన్నా లక్ష్మీనారాయణ కట్ చేశారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణను టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వై.రామస్వామి, తెలుగు యువత నాయకులు ఎం.శివనాగమల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు కె.రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎల్.గజానన, జి.అప్పారావు, పి.మల్లారెడ్డి, నన్నే సాహెబ్ పాల్గొన్నారు.

గాయపడిన కార్మికునికి సాయం



ప్రమాదంలో గాయపడిన భవన పెయింటింగ్ కార్మికుడైన మేస్త్రి సైదాకు కన్నా లక్ష్మీనారాయణ పుట్టినరోజు సందర్భంగా రూ.10 వేలను టిడిపి పట్టణ కార్యదర్శి జానుబాబు అందింకారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ సైదా టైలర్, షేక్ ఆదం, బ్రహ్మం, హరికృష్ణ పెయింటింగ్ యూనియన్ నాయకులు షేక్ సైదులు, హసన్, నాగులు, బుజ్జి మేస్త్రి పాల్గొన్నారు.



నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం పర్యాటకులు భారీగా సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీల్లో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్దిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేథశాల, స్నానాల గట్టును సందర్శించారు. అనంతరం అనుపు లోని యాంపి స్టేడియం, అశ్వమేథ యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ.55 వేల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

అత్యవసరమంటూనే హమాలీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

సివిల్ సప్లయిస్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని షాదీఖానాలో ఆదివారం నిర్వహించిన హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్కర్లకు సమగ్ర చట్టం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయాని విమర్శించారు. హమాలీలకు పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. చట్టపరమైన సౌకర్యాలైన ఆరోగ్య బీమా అమలు చేయడం లేదని, కూలి రేట్ల కోసం పదేపదే పోరాడాల్సి వస్తోందని చెప్పారు. ఎమర్జెన్సీ డ్యూటీ అని ఒక పక్క చెబుతూ రెండో పక్క వారి సమస్యలను మాత్రం ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని అన్నారు. కూలి డబ్బులు నెల చివరి వరకూ ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాగునీటి కింద నెలకు రూ.600 ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సమస్యలపై ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ హమాలీ ముఠా కార్మికులు సంపత్, వెంకటకృష్ణ , టంకయ్య, నాగేశ్వరరావు, శేషారావు, ఎం.సైదులు, భూపతిరావు, నరసింహారావు, అంకారావు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

షాదీఖానాలో రెండ్రోజులపాటు నిర్వహించిన సిఐటియు జిల్లా వర్కషాప్ ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శులు షేక్ ముజఫర్ అహ్మద్, కె.ఉమామహేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల లాభాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వీటి వల్ల కార్మికులు బానిసలుగా మారే ప్రమాదం ఉందని చెప్పారు. ఇదే విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ నేపథ్యంలో కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని, సిఐటియు పోరాటాల్లో కార్మికులు పెద్దఎత్తున కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు జి.విజయ్‌కుమార్, జి.రవి, షేక్ సిలార్, బి.మహేష్, పి.శ్రీనివాసరావు, జి.మల్లేశ్వరి, డి.శివకుమారి, టి.శ్రీనివాసరావు, షేక్ బందగి, హరిపోతురాజు పాల్గొన్నారు.

చెరుకూరి శ్రీరాములుకు ఘన నివాళులు



శ్రీరాములు స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కార్యకర్తలు, నాయకులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మాదల సిపిఎం వ్యవస్థాకులు చెరుకూరి శ్రీరాములు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జి.బాలకృష్ణ అనానరు. శ్రీరాములు 28 వర్ధంతి సభను ఆదివారం గ్రామంలోని శ్రీరాములు స్తూపం వద్ద నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన శ్రీరాములు నిరంతరం ప్రజా సమస్యలపై పని చేశారని, ఉపసర్పంచ్‌గా అనేక సేవలందించి ప్రజల మన్ననలను పొందారని చెప్పారు. ఏ సమస్య వచ్చిన రాజకీయాలకు అతీతంగా పరిష్కరిండచలో ముందున్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించి అధికారాన్ని కాపాడుకునే పనిలో పడ్డాయని, కుల, మత చిచ్చులు పెడుతున్నాయని విమర్శించారు. ప్రజలపై భారాలు వేయడంతోపాటు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.వెంకటరెడ్డి, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, జి.జాలయ్య, ఐ.వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీరాములు కుటుంబీకులు, స్థానికులు పాల్గొన్నారు.

వైద్య, విద్య రంగాలకు వైసిపి పెద్దపీట

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందని, ప్రజారోగ్యానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని 6వ వార్డు వెంకట్‌రెడ్డి నగర్‌లో రూ.1.06 కోట్లతో నిర్మించిన వైఎస్‌ఆర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్య సదుపాయాలతో పాటు వైద్యాధికారులు, సిబ్బంది తగినంత స్థాయిలో ఉన్నారన్నారు. 63 రకాల రక్త, ఆరోగ్య పరీక్షలను పిహెచ్‌సి స్థాయిలో తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోందని, దీనిలో భాగంగా ఆరోగ్య కేంద్రాలకు బయోకెమిస్ట్రీ, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్ లాంటి ఆధునిక పరికరాలను ఒక్కొక్కటిగా సమకూరు స్తోందని తెలిపారు. 175 రకాల మందులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథ మిక, పట్టణ ఆసుపత్రుల్లో లభించనున్నా యన్నారు. సీఆర్‌పి, ఎస్‌జిఓటి, ఎస్‌జిపిటీ, యుఆర్‌ఈఏ, హెచ్‌బి, ప్లేట్ లెట్ కౌంట్, సిబిసీ, టోటల్ బ్లడ్ సెల్ కౌంట్ ర్యాండమ్ బ్లడ్ షుగర్, బ్లడ్ యూనియా, హెపటైటీస్, హెచ్ ఐవి, డెంగీ, బ్లడ్ క్లాటింగ్ టైప్ థైరాయిడ్, సీరమ్ ప్రోటీన్ తదితర ఖరీదైన పరీక్షలు కూడా ప్రజలకు లభిస్తాయన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రులు, పిహెచ్‌సిల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీని రాష్ట్ర మరింత పటిష్టం చేసిందని, వైద్య రంగంలో ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ రోల్‌మోడల్‌గా నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్‌ఒ వినాయకం, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.శోభారాణి, డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ బి.గీతాంజలి, డాక్టర్ జి.హర్ష, డాక్టర్ హనుమ, దయానంద, కాంట్రాక్టర్ మంగపతిరెడ్డి పాల్గొన్నారు.

పట్టిసీమలో ఇన్‌సెంటివ్ పేర రూ.257 కోట్లు దోచుకున్న చంద్రబాబు

మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

రాష్ట్రంలో మళ్లీ వైసిపి అధికారం లోకి వస్తుందని, ఇది తెలిసే పవన్, చంద్రబాబు వైసిపిపై విషయం కక్కుతు న్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక ఆయన నివాసంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. పట్టిసీమను ఏడాదిలో పూర్తి చేస్తామంటూ సిఎంగా ఉన్నప్పుడు చెప్పిన చంద్రబాబు ఇన్‌సెంటివ్‌ల పేరుతో రూ.257 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. పట్టిసీమకు గత ప్రభుత్వం పర్యావరణ అనుమతులు తీసుకోని కారణంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.24.90 కోట్లు జరిమానా విధిస్తే దాన్ని తమ ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. వాలంటీర్లను దండుపాళ్యం ముఠాగా పవన్‌కల్యాణ్ అభివర్ణించడం ఆయన అవగాహన రాహిత్యమని, అసలైన దండుపాళ్యం బ్యాచ్ పవన్, లోకేష్, చంద్రబాబు అని దుయ్యబట్టారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని సీట్లకు పవన్ పోటీచేస్తారో చెప్పాలన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

సత్తెనపల్లిలో క్రికెటర్ల 2కె ర్యాలీ


ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సబ్ సెంటర్ అయిన స్థానిక ప్రగతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యూ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో క్రికెటర్లతో 3కె ర్యాలీని నిర్వహించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎపిఎల్ రెండవ సీజన్ ఈనెల 16-27 తేదీల్లో వైజాగ్‌లో జరుగుతుందని, ఆరు జట్లు తలపడనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పరిటాల నరేష్, కొత్త రామకృష్ణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
సోమవారం 14 ఆగస్టు 2023

17న చలో విద్యుత్ సౌధకు తరలి రండి

విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగుల వేతన ఒప్పందం రద్దు చేయాలని, ఆగష్టు 17న సంఘాలకు అతీతంగా నిర్వహిస్తున్న చలో విద్యుత్ సౌధ కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జిల్లా నాయకులు సిహెచ్.నాగబ్రహ్మాచారి, దాసరి వెంకటేశ్వరరావు, బి.లక్ష్మణరావు, జి.నాగరాజు కోరారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చలో విద్యుత్ సౌధ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల పిఆర్‌సి, ఇతర డిమాండ్స్‌పై 9న యాజమాన్యం, ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగ సంఘ నేతలతో చర్చలు జరిపి వేతన ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రకటించారన్నారు. అయితే ఈ ఒప్పందం పట్ల ఏఒక్క విద్యుత్ ఉద్యోగికిగానీ, అధికారులకూ, కార్మికులకు ఆమోదయోగం కాదన్నారు.వేతన సవరణ కోరుతున్న ఉద్యోగులకు వేతనాలు పెంచకుండా సరిపెట్టాలనే కుట్రలో భాగంగానే విద్యుత్ ఉద్యోగుల జీతాలు ఎక్కువని ప్రభుత్వం, యాజమాన్యం తప్పుడు ప్రచారం చేస్తుందని విమర్శించారు. 2014 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల జీతాలు ఒకే విధంగా ఉన్నాయని కానీ ప్రస్తుతం తెలంగాణ కంటే 30శాతం తక్కువ వేతనాలతో ఈ రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులు పని చేస్తున్నారని అన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు ముఖ్యమంత్రి చేసిన వాగ్ధానాలు అమలు చేయలేదని తెలిపారు. 45శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తుంటే 8శాతంతో సరిపెట్టుకోండి అనే ఒప్పందం ఎవరికి ఉపయోగం అని ప్రశ్నించారు. జెఎల్ఎం గ్రేడ్ -2లు విధి నిర్వహణలో చనిపోతున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. హక్కుల సాధనకు ఎవరి జెండాలు వారు, ఎవరి బ్యానర్ వాళ్ళు తీసుకుని పోరాటాల్లో కి రావాలని పిలుపునిచ్చారు. ఆగష్టు 17న విజయవాడలో విద్యుత్ సౌధ వద్ద జరిగే ధర్నాలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో జి.పవన్, వర్మ, ఆచారి తదితరులు పాల్గొన్నారు...



విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని నిరసన

కాజలో విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెంచిన విద్యుత్ బిల్లులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కాజ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేశారు. కాజా, వెంకట్ రెడ్డి పాలెంలలో రెండు చోట్ల ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ బిల్లుల భారాన్ని ప్రజలపై మోపి ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి. కోటేశ్వరి, నాయకులు ఎస్. సుమ, అవుతు విజయలక్ష్మి, కోటిరెడ్డి, శిరీష, టి.ప్రసాద రెడ్డి, కె. గోపాల రెడ్డి, జి.గోపాల రెడ్డి, సత్యమా రెడ్డి, ఎ. ప్రకాశరావు, దొడ్డక శ్రీను తదితరులు పాల్గొన్నారు.



భళా బాలలు

చిత్రలేఖనం పోటీలకు తరలివచ్చిన బాలబాలికలు









ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి ఐకాన్‌లో జరిగిన చిత్రలేఖనం పోటీలకు వివిధ పాఠశాలల నుంచి వందలాది మంది బాలబాలికలు తరలివచ్చారు. ఎండను సైతం లెక్క చేయకుండా బాలబాలికలు పెద్దఎత్తున తరలివచ్చి భళా బాలలు అనిపించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి వందలాది మంది ఒక్కసారిగా తరలిరావడంతో పేర్లు నమోదు చేసుకునే దగ్గర రద్దీ ఏర్పడింది. అయినా బాలోత్సవం నిర్వాహకులు ఓర్పుతో పిల్లలను వారికి కేటాయించిన హాల్‌లోకి పంపించారు. పిల్లల వెంట వచ్చిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వేరే చోట వసతి కల్పించారు. ఆదివారం సెలవు దినాన్ని సైతం పక్కనబెట్టి చిత్రలేఖనం పోటీలకు బాలబాలికలు తరలివచ్చారు. తల్లిదండ్రులు పిల్లలను తీసుకురావడానికి ఆసక్తిని కనబరిచారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లలను తీసుకువచ్చారు. తాము సైతం అంటూ పిల్లలు కూడా తమ వెంట డ్రాయింగ్ సామాగ్రిని తీసుకుని ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీలకు తరలివచ్చిన పిల్లలతో ఐకాన్‌లోని మూడు ఫంక్షన్ హాళ్లు నిండిపోయాయి.

ఐక్యత, ఆనందం కోసమే బాలోత్సవం

చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ ఐకాన్ గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్వహించారు. సభకు మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. వేదికపైకి ఐకాన్ మిత్ర బృందం తరుపున యడ్ల బాలకృష్ణ అతిథులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్ మాట్లాడుతూ మంగళగిరి, తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల పోటీలు ఐక్యత, ఆనందం కోసమేనని చెప్పారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలోత్సవ కమిటీకి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించబోయే కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి విసి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పోటీలకు పెద్దఎత్తున తరలివచ్చిన బాలబాలికలకు అభినందనలు తెలిపారు. ఎంటిఎంసి బాలోత్సవం అధ్యక్షులు వివి ప్రసాద్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ వచ్చి పిల్లల్లో ఆలోచనా శక్తిని తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చి వారి పనుల్లో నిమగ్నమవుతున్నారని, ఈ పరిస్థితి మారాలని కోరారు. రాష్ట్ర బాలోత్సవాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ బాలబాలికల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీయడానికి బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పండుగ పర్వదినాలకు సంబంధించి నిర్వహిస్తున్న బాలోత్సవాలకు విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాలకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. డిసెంబర్‌లో మంగళగిరిలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, విశ్వా మానవ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.మస్తానరావు, విఆర్ రెసిడెన్సీ అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్, అమరావతి బాలోత్సవం కార్యదర్శి ఆర్.కొండలరావు తదితరులు మాట్లాడుతూ దేశాన్ని ముందుకు నడిపించాల్సింది నేటి పౌరులేనని అన్నారు. విజ్ఞాన సముపార్జన ద్వారానే సమాజం ముందుకు వెళ్తుందని చెప్పారు. ఆటలు, పాటలు, చదువు జీవితంలో ఓ భాగం కావాలన్నారు. టెస్టు పుస్తకాలతో పాటు చరిత్రకు సంబంధించిన పుస్తకాలు కూడా చదవాల్సిన అవసరముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి బాలోత్సవం కార్యదర్శి శ్రీలక్ష్మి, న్యాయవాది విక్రం, కోటేశ్వరరావు, ఇ.రాజశేఖర్, ప్రకాష్, రియాజ్ బాష, వినోద్, నరసింహ, పీడీ రమేష్, ఎస్‌పి రామరాజు, నాగరాజు, వి.రమేష్‌బాబు, ఎం.కిషోర్‌కుమార్, లెక్చరర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చిత్రలేఖనం పోటీల సందర్భంగా బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యంగా అమరావతి ఐకాన్‌లో మహిళలు నేర్చుకున్న కోలాటంతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు, నృత్య రూపకాలు వచ్చిన వారిని అబ్బురపరిచాయి. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, కథ చెబుతాం కార్యక్రమాలు అలరించాయి.









మాట్లాడుతున్న డాక్టర్ పర్నికుమార్

'అవగాహన' ఆధ్వర్యంలో ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో నేత్ర వైద్యులు యం.ఫర్నీకుమార్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి.వి.హరికృష్ణ హాజరయ్యారు. ఫర్నీకుమార్ మాట్లాడుతూ మధుమేహం వల్ల రెటీనోపతి వస్తుందని, కంటిలోని చిన్న నరాలు దెబ్బతిని, రెటీనోపతి సమస్య తలెత్తుతుందని తెలిపారు. కళ్లలో ఒత్తిడి ఎక్కువ అయినందువల్ల గ్లాకోమా వస్తుందన్నారు. లేజర్ విధానంలో వైద్యం చేస్తామన్నారు. గ్లాకోమాను గుర్తించి, వైద్యం తీసుకోకుండా నిర్లక్ష్యం క్యాటర్యాక్ట్ గురించి తెలుపుతూ దీనిని మనం సాధారణంగా శుక్లం అని అంటారన్నారు. వీటికి లైన్సెస్ అనగా కళ్లలో అద్దాలు వేస్తారని తెలిపారు. కళ్ల కలక గురించిాది వైరస్ అని,ాది గాలి ద్వారా వాడే వస్తువులు ద్వారా దుస్తుల ద్వారా ఒకరి నుండి మరొకరికి సోకుననిాది వస్తే ఒక వారంపాటు ఉంటుందన్నారు. తర్వాత సాధారణంగా నయం అవుతుందన్నారు. నేత్రదానం గురించి వివరిస్తూ మనిషి మరణించిన 6 గంటలలోపు తీసుకోగలిగితే వేరొకరి ఉపయోగించవచ్చన్నారు. డాక్టర్ బి.వి.హరికృష్ణ మాట్లాడుతూ నేడు ప్రతి అనారోగ్యానికి మందులు వేసుకోవటం జరుగుతుందన్నారు. అలా కాకుండా కొన్ని అనారోగ్య సమస్యలకు అంటే నొప్పులు, కండరాలు పట్టుకుపోవటం లాంటి సమస్యలకు ఫిజియోథెరపి ద్వారా చాలా చక్కని వైద్యం అందుబాటులో ఉందన్నారు. మన శరీరానికి శారీరక శ్రమ కల్పించాలని, ఈ ఫిజియోథెరపి ద్వారా చికిత్స దుష్ప్రరిణామం లేదన్నారు. ఏ శస్త్ర చికిత్స తర్వాత అయినా ఫిజియోథెరపి చాలా ముఖ్యమని అన్నారు. ఫిజియోథెరపి ద్వారా నయం అయ్యే సమస్యలకు కూడా మందులు వాడటం వల్ల మలబద్దకం కలగటం, తద్వారా అనేక ఇతర అనారోగ్య సమస్యలు వచ్చిాబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం డాక్టర్ ఫిర్నికుమార్, బి.వి హరికృష్ణను అవగాహన సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు పసర్ల కోటేశ్వరరావు, ఎస్.శివశంకర రావు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

ప్రజాశక్తి - అమరావతి

మహిళా సాధికారత మహిళ హక్కుల కాపాడటమే యూత్ కాంగ్రెస్ లక్ష్యమని పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి అన్నారు. బెంగళూరులో జరిగిన జాతీయ సమావేశాల్లో ప్రతిష్టాత్మంగా తీసుకున్న సూపర్ శక్తి స్త్రీ అనేటువంటి గొప్ప కార్యక్రమాన్ని ఇండియన్ యూత్ కాంగ్రెస్ చేపట్టినట్టు చెప్పారు. ఆగస్టు 15న మహిళల చేత జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరుగుతుందని, మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు.



జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ కళ్ళజోళ్ళు పంపిణీ

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరులో ఆదివారం జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా ఆధ్వర్యంలో 250 మందికి ఉచిత కళ్ళ జోళ్ల పంపిణీ చేశారు. వికలాంగులకు ,అనారోగ్యంతో బాధపడుతున్న వృద్దులకు,10 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు,స్పోర్ట్స్ లో ప్రతిభ కనబరిచిన వారికి మొత్తం 50 మందికి 3 వేలు రూపాయలు చొప్పున మొత్తం రూ.1,50,000 ఆర్థిక సహాయం అందించిన జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా ఈ సందర్భంగా జాయింట్ చేయడం మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని 53 గ్రామాల్లో సుమారు 30 గ్రామాల్లో ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమం జరిగినట్లు చెప్పారు. నియోజకవర్గ మొత్తంలో సుమారు ఇప్పటివరకు మూడు కోట్ల రూపాయలు వెచ్చించి పేదవారికి అందజేసినట్లు ఆయన చెప్పారు.

మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం

ప్రజాశక్తి-తెనాలి



న్యాయవాది మురళీధర్ ను సత్కరిస్తున్న కృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణ దశల వారి పోరాటంలో భాగంగా మాదిగల విశ్వరూప మహా సభకు సన్నద్ధం కావాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. విశ్వరూప మహా సభకు సన్నాహక సమావేశంలో భాగంగా ఆదివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య సమావేశ మందిరం లో జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సంర్భంగా ఎంఆర్పిఎస్ లోని లాయర్స్ ఫెడరేషన్‌తో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల లోగా ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభ భారీగా జరుగుతుందని, సెప్టెంబర్ 10లోగా మహాసభ వివరాలు వెల్ల డిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సల్ నుంచి మట్ట జైకర్, విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నట్లు మురళీధర్ తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనీస వసతులేవి?

- సరిపడా కుర్చీలు లేవు
- తాగునీరు, వాష్‌రూమ్స్ లేవు
- పార్కింగ్ సౌకర్యమూ కరువే

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఆస్తుల క్రయ, విక్రయాలు,ఇతర అవసరాల కోసం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి, రైటర్లకు, స్టాంపు వెండర్లకు, ముఖ్యంగా మహిళలకు అక్కడ కనీస సౌకర్యాలు కూడా లేవు. ఈ కార్యాలయానికి పనుల నిమిత్తం నిత్యం వచ్చే వారి సంఖ్య వందల్లో ఉంటే కుర్చీలు మాత్రమే తగినన్ని లేవు. తాగునీరు, కుర్చీలు, వాష్‌రూమ్స్, ఎండవానల బారినపడ కుండా ఉండేందుకు షెడ్లు, పార్కింగ్ సౌకర్యం కరువ య్యాయి. ఈవిషయమై అటు ప్రభుత్వం గానీ ఇటు అధి కారులు గానీ పట్టించుకోవడం లేదని ఇక్కడికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు విమర్శిస్తున్నారు. ఈ కార్యాలయం 1911లో నరసరావు పేట నుంచి విడివడి 1927వ సంవ త్స రంలో సొంత భవనంలోకి వచ్చింది. 1980 సంవత్స రంలో పర్చూరు,1982వ సంవత్సరంలో మార్టూరు దాకా ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే కార్యకలాపాలు జరిగేవి. ప్రస్తుతం ఈ కార్యాలయ పరిధిలో చిలకలూరిపేట,నాదెండ్ల, యడ్లపాడు,పెదనందిపాడు నాలుగు మండలాల పరిధిలోని 29 రెవిన్యూ గ్రామాలు, వాటి అనుబంధ పంచాయతిలు ఈ కార్యా లయం పరిధిలో ఉన్నాయి. లక్షల కోట్ల విలువ చేసే డాక్యుమెంట్లు ఉండే ఈ కార్యాలయం ప్రధానగేట్ తుప్పుపటి ్టపోయి ఉండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పం దించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు కోరు తున్నారు.



తుప్పు పట్టి ఉన్న చిలకలూరిపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రధాన గేట్



కార్యాలయం ప్రాంగణంలోని కుర్చీల్లో కూర్చుని ఉన్న వారు



రోడ్డు పక్కనే వాహనాలు పార్కింగ్ ..



వర్షమొస్తే ఎటుపోవాలో తెలియని పరిస్థితి..

సత్తెనపల్లిలో 3కె రన్ ర్యాలీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

'మన ఆంధ్ర-మన ఏపీఎల్' నినాదంతో 3కె రన్ ర్యాలీ సత్తెనపల్లి పట్టణంలో ఆదివారం ఆహ్లాదకం వాతావరణంలో ఘనంగా జరిగింది. ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ సబ్ సెం టర్ అయిన ప్రగతి ఇనిస్టిట్యూషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న న్యూ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ ని క్రికెట్ ప్లేయర్లతో నిర్వహించింది. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీనివాసరాజు మాట్లా డుతూ ఏపీఎల్ రెండో సీజన్ ఆడుతుందని తద్వారా ఆంధ్రాలో ఉన్న ఆరు జట్లు 120 మంది ఆంధ్ర ప్లేయర్స్ ఆడతారని ప్రతిభ కనబరిచేందుకు ఇదొక అవకాశమని చెప్పారు. ప్రగతి కాలేజ్ డైరెక్టర్ పరిటాల నరేష్ మాట్లా డుతూ ఆంధ్ర లో ఉన్న ఎంతో ప్రతిభగల విద్యార్థులు ఈ లీగ్ ద్వారా బయటికి వస్తారని, ఇలాంటి టోర్నీలు మరిన్ని నిర్వహించి ఆంధ్ర ప్లేయర్స్ కి సదవకాశాలు కల్పించాలని కోరారు. గవర్నమెంట్ హాస్పిటల్ డైరెక్టర్ కొత్త రామకృష్ణ



మాట్లాడుతూ ఆంధ్ర క్రికెట్ నుంచి ఇంటర్నేషనల్ ప్లేయర్స్ చాలా అరుదుగా ఉంటారని , ప్రతిభ ఉన్నా కూడా మనవారు ఇంటర్నేషనల్‌కు సెలెక్ట్ అవడం చాలా అరుదుగా జరిగేదని చెప్పారు. ఇలాంటి లీగ్స్ నిర్వహించడం వల్ల ఆంధ్రాలో ఉన్న ప్లేయర్స్ ను వెలికి తీయటానికి ఒక మార్గం అని అన్నారు. ఈ లీగ్ 16వ తారీకు నుంచి 27వ తారీకు వరకు వైజాగ్ లో నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రగతి ఇన్స్టిట్యూషన్ హెడ్ అచ్చయ్య, ప్రగతి ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ పరిటాల నరేష్, న్యూ క్రికెట్ క్లబ్ హెడ్ కోచ్ కృష్ణ, గంప శ్రీనివాసరావు, దాదావలి న్యూ క్రికెట్ క్లబ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన రూ 4.50 లక్షల ఆర్థిక సహాయాన్ని (చెక్కులు)ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని (చెక్కులు) పార్టీ కార్యాలయంలో అంద జేశారు. రొంపిచర్ల మండలంలోని రామిరెడ్డి పాలెం గ్రామా నికి చెందిన కేతే సూర్య ఆదిత్య రెడ్డి తండ్రి నాగేశ్వర రెడ్డి ఇటీవల వెంకటాయ పాలెంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డిని కలిశారు. ఆదిత్యరెడ్డి బ్లడ్ క్యాన్సర్ తో బాధ పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో లబ్ధిదారులు

తీసుకెళ్లగా వైద్య ఖర్చుల కోసం తక్షణం రూ 1లక్ష ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ 2.50 లక్షలను నాగేశ్వరరెడ్డికి అందజేశారు. అదేవిధంగా రొంపిచర్లలో ని అరవపల్లి ఉమామహేశ్వర రావుకు రూ 2 లక్షల చెక్కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఏటా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత నందిస్మున్నట్లు చెప్పారు. ప్రతి నియోజ కవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే గోపిరెడ్డి నివాళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలో శనివారం రాత్రి విద్యుత్ షాక్ తో మృతి చెందిన నామాల కోటిరెడ్డి కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. కోటిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి పిల్లి ఓబుల్ రెడ్డి, మండల కన్వీనర్ పచ్చవ రవీంద్ర బాబు, ఎంపిపి గడ్డం నాగమణి వెంకట్రావు, వైసిపి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా దేశం కోసం పోరాడారని వారిని స్ఫూర్తిగా తీసుకొని దేశ అభివృద్ధి కోసం విద్యార్థులు కృషి చేయాలని, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని దానిని విద్యార్థులందరూ కొనసాగించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ఆధ్వర్యంలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ జెవివి వారు విద్యార్థుల్లో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిలించటానికి ాటువంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినంద నీయం అన్నారు.



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు



విజేతలను అభినందిస్తున్న పాటిబండ్ల స్కూల్ కరస్పాండెంట్ తదితరులు

డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ జూనియర్, సీనియర్ విభాగాలలో 500 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ తెలిపారు. కార్య క్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, టి.జాన్‌బాబు, బి.శంకర్‌సింగ్, కె.సాయి కుమార్, హరీష్, దేవసూర్య, యం.చిన్నయ్య, ఉదయభాస్కర్, జి.వెంకటరావు, పాఠశాల డైరెక్టర్ ఎల్.కృష్ణవేణి, ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

కవి ఆళ్లకు స్వాతంత్ర్య దినోత్సవ పురస్కారం



ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన కవి ఆళ్ల నాగేశ్వర రావు స్వాతంత్ర్య దినోత్సవ పురస్కారానికి ఎంపికయ్యారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంకు చెందిన అర్పిత సాహిత్య సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ పురస్కారాలలో భాగంగా సాహితీ రంగానికి సంబంధించి నాగేశ్వరరావును ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షులు జి.విజయ్‌కుమార్ పంపిన ఎంపిక పత్రాన్ని వాట్సప్ ద్వారా అందుకున్నట్లు నాగేశ్వరరావు చెప్పారు. ఈ నెల 28న హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించే సభలో ఆళ్ల ఈ పుర స్కారాన్ని అందుకోనున్నారు.

'ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి'

ప్రజాశక్తి-తెనాలి

ఆజాదిక అమత్ మహొత్సవం కార్యక్రమంలో భాగంగా దేశానికి స్వాతంత్రం వచ్చి 77వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా జాతీయతా భావంతో ప్రతి ఒక్కరు తమ ఇళ్ళు, వ్యాపార సంస్థలపై జాతీయ జెండా ఎగురవేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదివారం చెప్పారు.కలెక్టర్ ఆదేశాల మేరకు 'నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం' అనే కార్యక్రమం ద్వారా జాతీయ జెండాని ఎగురవేసిన ప్రతి ఒక్కరు సెల్ఫీ తీసుకొని దానిని డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.హర్షర్తిరంగా.కామ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు.

రోటరీ అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి,రోటరక్ట్ క్లబ్ అఫ్ కెఎల్‌యు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రాతూరు రోడ్డులోని శ్రీ ఫార్చున్ గ్రాండ్ వద్ద నుండి హెచ్.పి బంక్ పాత టోల్ గెట్, వైసీపీ కేంద్ర కార్యాలయం మీదుగా శ్రీ ఫార్చున్ గ్రాండ్ వరకు 2.5 కిలో మీటర్ల రోటరీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పోలియోను అదుపు చేయడంలో రోటరీ పాత్ర ఎంతో కీలకమైంది అని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేశామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి చంద్ర ఓబులారెడ్డి మాట్లాడారు. రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి కోశాధికారి గోపు నాగ రాజేష్, సభ్యులు శెట్టి రామకృష్ణ, శెట్టి కేశవరావు, మున్నంగి వివేకానందారెడ్డి, కాట్రగడ్డ శివనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, సుకుమార్ రెడ్డి, శంకర్ శెట్టి రమేష్, రవీంద్ర రెడ్డి,శ్రీలత కొత్తలంక అమరేంద్ర, రోటరక్ట్ క్లబ్ ఆఫ్ కె ఎల్ యూ విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీక్.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పెదనందిపాడు

మండలంలోని నాగులపాడు స్టేట్ బ్యాంక్ వద్ద సిమెంట్ రోడ్డు మీద వాటర్ పైప్‌లైన్ పగిలి గత నాలుగు రోజులుగా నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామ స్తులు చెబుతున్నారు. వెంటనే పగిలిన పైపులైన్‌ను మార్చి నీరు వృథా కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



నాగులపాడులోని సిమెంట్ రోడ్డు వద్ద ..

భవన యజమానుల బాధలు పట్టించుకోరే? : టిడిపి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

భవన యజమానుల బాధలు పట్టించుకునే వారు ఎవరని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రశ్నించారు. పొన్నూరు టిడిపి కార్యా లయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మూడు రోజుల నుండి విద్యుత్ సరఫరా ఆపడంతో భవన యజమానులు చీకట్లోనే మగ్గుతున్నారని, పగలంతా వందలాది మంది పోలీసులతో పహరా కాయిస్తూ రాత్రిపూట ఒక్క పోలీస్ కూడా లేకపోవడంతో భవన యజమానుల సామగ్రి దొంగల పాలవుతోందని అన్నారు. మున్సిపల్ అధికారులు మెటీరియల్ తరలించ డానికి ట్రాక్టర్ బాడుగ ప్రైవేటు వ్యక్తులు నుండి వసూలు చేస్తున్నారని, భవనాలు పగలగొట్టగా వచ్చిన మెటీరియల్‌ను ట్రాక్టర్ల ద్వారా తరలించి పాత ఐరన్ కొనేవారికి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సమా వేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు పఠాన్ అహ్మద్ ఖాన్, టిడిపి మండల అధ్యక్షులు బి.బాబురావు, పొన్నూరు నియోజకవర్గ టిడిపి సెల్ అధ్యక్షులు వై.సోంబాబు, మాజీ కౌన్సిలర్ టి లక్ష్మి నారాయణ చౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

విగ్రహాల తొలగింపులో నిర్లక్ష్యం తగదు

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ లో మునిసిపల్ అధికారులు తొలిగించిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని అమరజీవి పొట్టి శ్రీ రాములు విగ్రహాలను తొలగించిన ప్రదేశాలను టీడీపీ నాయకులు సందర్శించారు మునిసిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరించారని, విగ్రహాలను తొలగించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోలేదని అన్నారు. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

'యువగళం' సన్నాహక సమావేశం

ప్రజాశక్తి - దుగ్గిరాల

యువగళ యాత్ర రాబోయే ఎన్నికల ప్రక్రియలో యువత ప్రాముఖ్యత నిర్దేశిస్తుందని దానికి యువత సిద్ధంగా ఉండాలని మండల తెలుగుదేశం నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రం దుగ్గిరాలలో ఆదివారం జరిగిన యువగళ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షులు కె. శ్రీ అనిత మాట్లాడుతూ ఈనెల 15న మంగళగిరి నియోజకవర్గంలో ప్రవేశించనున్న యువగళ యాత్రకు మండలం నుండి పెద్ద ఎత్తున స్వాగతం పలకాలని కోరారు. యువత అధ్యక్షులు పి.మహేష్ మాట్లాడుతూ 16న జరగబోయే 'హలో లోకేష్' కార్యక్రమంలో విద్యార్థులు ,యువత పాల్గొని సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్తులో పరిష్కారం పొందవచ్చని అన్నారు. అనంతరం రాష్ట్ర నాయకులు జి.వెంకట్రావు, సీనియర్ నాయకులు కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా యువగళం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి. చంటి, వి.నరసింహారావు, కాకా బాబు, జి.శ్రీనివాస్, పి. హర్ష ఎన్. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



యువగళం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు



రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలో జరుగుతున్న జి బి సి రోడ్ విస్తరణ అభివృద్ధి పనులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, తెనాలి డిఎస్పి బి. జనార్ధనరావుతో కలిసి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును మున్సిపల్ డి ఈ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు నిబంధనల ప్రకారం విస్తరణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న వైసిపి నాయకులు శ్రీనివాసరావు

నిరుపేద మహిళలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండ ఆక్సా నగరకు చెందిన ఆస్మా అనే నిరుపేద మహిళలకు ఆదివారం వైఎస్ఆర్సిపి గ్రామ నాయకులు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని, రెండు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేశారు. భర్త చనిపోయి అనేక ఇబ్బందులు పడుతున్న ఎస్కే ఆస్మా ఇబ్బందులు పడటంతో, మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి సహకారంతో నిరుపేద మహిళకు ఆర్థిక సహాయం అందజేశామని నూతక్కి శ్రీనివాసరావు తెలిపారు.



కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తెనాలి

శ్రీ వెంకటేశ్వర కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్య క్షులుగా జవ్వాజి వెంకట కృష్ణారావు 122 ఓట్లు, కార్య దర్శిగా అలవల వెంకట నరసింహారావు 89, కోశాధి కారిగా కొత్త మాసు యజ్ఞ ప్రసాద్ 141 ఓట్ల భారీ మెజారి టీతో గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా బింగుమళ్ల సుబ్రహ్మణ్యం, తల్లం చంద్రశేఖర రావు, మాలేపాటి నాగ వెంకట సత్యనారాయణ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

'సినిమాలపై రివ్యూలు, రేటింగ్‌లతో నష్టాలు'

ప్రజాశక్తి-తెనాలి

కోట్లాది రూపాయల పెట్టుబడితో నిర్మించిన సినిమాలకు విడుదల రోజునే సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా ఇస్తున్న రివ్యూలు, రేటింగుల ప్రభావం నిర్మాణ రంగాన్ని నష్టాల వైపు నడి పిస్తోందని దీనిపై కోర్టును ఆశ్రయించనున్నట్లు ఎపి మూవీ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు దిలీప్ రాజా చెప్పారు. స్థానిక కార్యా లయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినిమాలపై సోషల్ మీడియా రివ్యూలు, రేటిం గులు స్వార్ధ పూరితంగా ఉన్నాయని, నిర్మాతలను నిలు వునా ముంచేస్తున్నాయన్నారు. నిర్మాతల జీవితాలను దుర్భ రం చేసేలా రేటింగులు, రివ్యూలు పెట్టవద్దని ఆయన యూట్యూబ్ నిర్వాహకులను, సోషల్ మీడియా ప్రతి నిధు లకు ఆయన హితవు పలికారు. చిన్న సినిమాల పరిస్థితి అయితే చెప్పనలవి కాకుండా ఉందన్నారు.



మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవ దినోత్సవం స్థానిక కిరాణ మర్చంట్ సొసైటీలో ఘనంగా జరిగాయి. ఎన్జీవోస్ అందరిని సత్కరిస్తూ అవార్డులు ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమాశంకర్‌ని పలువురు అభినందించారు. ఉమాశంకర్ మాట్లాడుతూ తన తోటి టీం సభ్యులు, కుటుంబ సభ్యులు ముఖ్య అతిథులు ఆత్మీయులు ప్రతి ఒక్కరూ పాల్గొనడం సంతోషకరమని అన్నారు.

ఉచిత న్యాయ సలహా శిబిరం

ప్రజాశక్తి-తెనాలి



స్థానిక బోసు రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య లీగల్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘాల కోఆర్డినేటర్ మద్దాలి శేషాచలం శిబిరాన్ని ప్రారంభించారు. తెనాలి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు న్యాయ సలహాలు పొందారు. అధ్యక్షులు భాస్కరుని శ్రీనివాసరావు మాట్లాడారు. శిబిరంలో సీనియర్ న్యాయవాదులు దరిసి శివ కోటేశ్వరరావు, గ్రంధి జయరామకృష్ణ , సంకా ఆంజనేయులు, నాగేంద్రం, జవ్వాజి శ్రీనివాసరావు న్యాయ సలహాలను అందించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం, దాని అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధుల సేవాశ్రమంలో నేత్ర పరీక్షా శిబిరం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 99 నేత్ర పరీక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా కళ్ళజోళ్ళు అవసరం ఉన్న 50 మందికి ఉచితంగా వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, పిరమిడ్ ధ్యాన ప్రచారకులు వల్లభనేని వాణి పాల్గొన్నారు.అనంతరం వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులైన డాక్టర్ సూర్య రఘురాం, సూరి ఉష, మాచర్ల వెంకటగిరి, సరళ దేవి, డాక్టర్ ఉక్కడపు రామమోహనరావు, విద్యలను సత్కరించారు. కార్యక్రమంలో రామనాథం పూర్ణచంద్రరావు, ఆకురాతి శంకరరావు, దీపాల సాంబశివరావు, కొసనం శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మధ్య విద్వేషాలు తీసుకురావద్దు

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర మహాసభలో వక్తల పిలుపు

మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని బిజెపిపై తీస్తా సెతల్వాద్ విమర్శ


మాట్లాడుతున్న జెకెసి కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్


మాట్లాడుతున్న జస్టీస్ కెజి శంకర్


మాట్లాడుతున్న ఐలు నేత పార్థసారధి


మాట్లాడుతున్న కెవి సురేంద్ర నాథ్


మాట్లాడుతున్న డి రాజగోపాల్



ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో అన్ని తరగతుల ప్రజలు కలసిమెలసిఉండేలా పాలకులు కృషిచేయాలే కానీ వారి మధ్య విద్వేషాలు పెంచేలా ప్రయత్నించకూడదని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక శుభం కల్యాణ మండపంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర మహాసభల సందర్భంగా గుంటూరులో ప్రజాస్వామ్యం పరిరక్షణ, రాజ్యాంగరక్షణ అనే అంశంపై ఆదివారం జరిగిన సెమినార్‌లో పలువురు ప్రముఖులు మాట్లాడారు. సభకు ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ కీలక ఉపన్యాసం చేశారు. అంబేద్కర్ వర్థంతి రోజున బాబ్రి మసీదును కూల్చడం వెనుక ప్రత్యేక భావజాలం ఉందన్నారు. వివిధ మతాల ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. అంబేద్కర్ అంటే గౌరవంలేదు...మైనార్టీలంటే ద్వేషంతో బిజెపి పయనిస్తుందన్నారు. దక్షిణ భారతంలో కర్నాటకలో తప్ప మిగతా రాష్ట్రాలలో బిజెపి ప్రభావం అంతగాలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశ ద్రోహం చట్టం రద్దు చేసినా బిజెపి ఫాసిజంతో మరో చట్టంరూపకల్పన చేస్తున్నారని అన్నారు. బిజెపి అవలంభిస్తున్న మతతత్వ,ఫాసిస్టు ధోరణులను కవులు, కళాకారులు,న్యాయవాదులు, మేధావులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలనిఅన్నారు.

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గుజరాత్‌లో 2002లో జరిగిన మారణకాండలో ఎంతో మంది బలయ్యారని అన్నారు. హిట్లర్ తరహాలో అప్పట్లో బిజెపి నాయకులు ఊచకోత కోశారని అన్నారు. గోద్రా అల్లర్ల ఘటన దేశాన్ని కుదిపివేసినా దోషులపై తగిన చర్యలు లేవన్నారు. జమ్ముకాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు, ఉమ్మడి పౌరస్మృతిచట్టం, గోరక్ష దళాల దాడులు, హిందూ,ముస్లిం,క్రైస్తవుల మధ్య ఘర్షణలు సృష్టించడం పరిపాటిగా మారిందన్నారు. యుసిసిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే ఈ బిల్లు తెస్తున్నారని అన్నారు. అన్ని కులాలు, మతాలు కలసిఉండాలని ఐలూకోరుకుంటుందన్నారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని పాలకులు రాజ్యాంగాన్ని తిరగరాయాలన్న ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. చట్టసభల్లో ఆమోదం పొందుతున్న బిల్లులపై చాలా మంది మంత్రులకు కనీస అవగాహన కూడా ఉండటం లేదన్నారు. బిల్లులు ఆమోదంపై విస్తృత చర్చ జరగాలన్నారు. దేశంలో న్యాయవ్యవస్థ మాత్రమే ప్రజాస్వామ్యంను కాపాడుతుందన్న నమ్మకాన్ని పెంచాలన్నారు.

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగం సాధికారితపై ప్రచారం చేయడంలో పాలకులు విఫలం అయ్యారని అన్నారు. ప్రజల మధ్య సమతా భావాన్ని పెంపొదించడంలో సరైన దిశలో వెళ్లడం లేదన్నారు. రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్ల అవుతున్నా అంబేద్కర్, గాంధీ గురించి తగిన ప్రచారం లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఇబ్బందుల్లో ఉన్నప్పుడే ప్రజాస్వామ్యంపై మాట్లాడుతున్నారని అన్నారు. న్యాయవ్యవస్థ ఉనికి కాపాడుకోవడం కోసం ధర్మం కోసం ప్రయత్నించాలన్నారు. ఐలు రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ కేసులో గుజరాత్ హైకోర్టు చాలా విచిత్రంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు సరైన నిర్ణయం తీసుకోబట్టి రాహుల్‌కు బెయిల్ లభించిందన్నారు. ఐలూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె.పార్థసారధి మాట్లాడుతూ కాంగ్రెస్ హయంలో 21 నిమిషాల్లో 18బిల్లులు ఆమోదించారని ఆరోపించిన బిజెపి ఇప్పుడు అంతకంటే ఘోరంగా పార్లమెంటులో వ్యవహరిస్తుందన్నారు. దేశంలో మనువాదాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె.జి.శంకర్ మాట్లాడుతూ పలు కేసుల్లో బెయిల్ ఇచ్చే విషయంలో భిన్న నిర్ణయాలు వస్తున్నాయన్నారు.

గుజరాత్ హైకోర్టులో రాహుల్‌గాంధీకి బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ జడ్జి చేసిన వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. ఐలూ అఖిల భారత కార్యదర్శి,సుప్రీంకోర్టు న్యాయవాది సురేంద్రనాథ్, జెకెసి న్యాయకళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, సమాచార చట్టం కార్యకర్త పట్నాయక్, ప్రొఫెసర్ ఎన్.రంగయ్య తదితరులు ప్రసంగించారు.


ఐలు సదస్సులో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు


ఐలు మహాసభలో తీర్మానాలకు ఆమోదం తెలుపుతున్న ప్రతినిధులు


ఐలు మహాసభలో మాట్లాడుతున్న న్యాయవాది దాసరి ఉదయశ్రీ


సదస్సులో హాజరైన ప్రతినిధులు, ప్రజలు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్


మాట్లాడుతున్న ఐలు నాయకులు నర్రా శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ఐలు నాయకులు రాజేంద్ర ప్రసాద్

